సాక్షి ఖమ్మం

శనివారం । 12 । అక్టోబర్ । 2024



మెడిసిన్ విద్యార్థినికి చేయూత

నిరుపేద మెడిసిన్ విద్యార్థిని ఇబ్బందులపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో దాతలు రూ.6లక్షలకు పైగా సాయం అందించారు. 8లో



సమష్టి కృషితోనే...

అంతా కలిసి పనిచేస్తేనే సింగరేణి సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

516 మంది ఉపాధ్యాయుల రిపోర్టింగ్



దీఈఓ కార్యాలయానికి వచ్చిన నూతన ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: డీఎస్సీ–2024లో జిల్లా నుంచి 520మంది అర్హత సాధించగా ఇటీవల నియామక పత్రాలు అందుకున్నారు. ఈమేరకు వీరు డీఈఓ కార్యాలయంలో రిపోర్ట్ చేస్తున్నారు. ఇప్పటివరకు 520మందిలో 516మంది రిపోర్ట్ చేశారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. దసరా పండుగ అనంతరం వీరికి కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఇవ్వనున్నట్లు తెలిసింది.

ఎమ్మెల్సీ ఓటర్లుగా 18 దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్లుగా నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 18 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఇందులో ఖమ్మం అర్బన్ మండలం నుంచి ఆరు, ఖమ్మం రూరల్ నుంచి మూడు, మధిర, సత్తుపల్లి మండలాల నుంచి రెండు చొప్పున, కల్లూరు, కామేపల్లి, కొణిజర్ల, సింగరేణి, తల్లాడ మండలాల నుంచి ఒక్కో దరఖాస్తు ఉందని వెల్లడించారు. అర్హులైన ఉపాధ్యాయులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆధార్ లింక్ అయిన అకౌంట్ తప్పనిసరి

ఖమ్మంమయూరిసెంటర్: 2024–25 విద్యాసంవత్సరానికి ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుండగా కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసిందని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఆధార్ లింక్ అయిన బ్యాంక్, పోస్టల్ ఖాతా తప్పక కలిగి ఉండాలని తెలిపారు. కాగా, ఆధార్ లింకేజీతో తపాలాశాఖ ద్వారా సులువుగా అకౌంట్ పొందొచ్చని, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా రూ.149తోనే ఖాతా తెరిచే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు అర్హులైన ఎస్సీ విద్యార్థులు గమనించాలని ఆయన సూచించారు.

పంటలు పరిశీలించిన డీఏఓ



మిరప చేనులో పరిశీలిస్తున్న డీఏఓ, ఉద్యోగులు

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలో వరి, పత్తి, మిరప పంటలను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలను చీడపీడలు ఆశిస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి సరిత, ఏఈఓ మౌనిక పాల్గొన్నారు.

టార్చ్ ర్యాలీ.. జిల్లాలో 76 కి.మీ.

- 15న భద్రాద్రి మీదుగా జిల్లాలోకి ప్రవేశం

ఖమ్మం స్పోర్ట్స్: సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా టార్చ్ ర్యాలీ నిర్వహిస్తుండగా జిల్లాలో 76 కి.మీ. మేర కొనసాగనుందని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈనెల 15వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చేరుకోనున్న ర్యాలీ అక్కడి నుంచి ఏన్కూరు మండలం భగవాన్ తండా వద్ద జిల్లాలోకి ప్రవేశిస్తుందని వెల్లడించారు. అక్కడి నుంచి ఏన్కూరు, జన్నారం తండా మీదుగా కొణిజర్ల మండలం కోనాయిగూడెం, అంజనాపురం, గుబ్బగుర్తి, పెద్దరాంపురం, లక్ష్మీపురం, మంగాపురం, తీగలబంజర, లాలపురం, పల్లిపాడు, కొణిజర్ల, తనికెళ్ల, రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం, గోపాలపురం మీదుగా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం మీదుగా సాయంత్రం 4–30 గంటలకు లకారం ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఆతర్వాత 16న ఉదయం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం, గోళ్లగూడెం, చింతపల్లి, తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణి, తిరుమలాయపాలెం, పాతర్లపాడు, చంద్రుతండా, మహ్మదాపురం, సుబ్లేడ్ క్రాస్ రోడ్ మీదుగా మహబూబాబాద్ జిల్లాలోకి వెళ్తుందని డీవైఎస్‌ఓ వివరించారు. ర్యాలీలో క్రీడాకారులు, క్రీడాసంఘాల బాధ్యులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

అంతర్జాతీయ ప్రమాణాలు.. నాణ్యమైన విద్య

- అన్ని వసతులతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- లక్ష్మీపురంలో పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వైరా ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

బోనకల్: ఇతర రాష్ట్రాలకు మండలంలోని లక్ష్మీపురంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఆదర్శంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆకాంక్షించారు. మండలంలోని లక్ష్మీపురంలో 25ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న రెసిడెన్షియల్ పాఠశాలకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత ప్రజలు, విద్యార్థులు ఆయన స్వాగతం పలకగా భట్టి మాట్లాడారు. పేద విద్యార్థులకు ఉచితంగా, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి రూపకల్పన చేశామని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించడంతో పాటు అనేక సామాజిక రుగ్మతలపై పోరాటం చేసిన చరిత్ర ఉండడంతో లక్ష్మీపురంను ఎంపిక చేశామన్నారు. అనేక చారిత్రక పోరాటాలు, త్యాగాలకు నెలవైన మధిర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం.. తద్వారా తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడమే లక్ష్యమని భట్టి తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దేందుకు పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలు వచ్చే ఏడాదికల్లా అందుబాటులోకి వస్తాయని.. అన్నివర్గాల విద్యార్థులకు ప్రవేశాలు ఉంటాయని భట్టి వెల్లడించారు.

గురుకులాల రూపకల్పనలో భట్టి కీలకం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం ఏర్పాటుచేస్తున్న రెసిడెన్షియల్ స్కూళ్ల రూపకల్పనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక పాత్ర పోషించారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. ఇవి ప్రారంభమైతే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలకులు ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తే తమ ప్రభుత్వం చక్కదిద్దుతోందని తెలిపారు. కాగా, సీపీఐ నాయకుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, సీపీఎం నుంచి పొన్నం వెంకటేశ్వరావు, బీఆర్ఎస్ నాయకుడు ముత్తారపు వెంకటిని భట్టి వేదికపైకి ఆహ్వానించి మాట్లాడించారు. ఈ సందర్భంగా వారు మధిర అభివృద్ధికి పాటుపడుతున్న భట్టి విక్రమార్కకు అండగా నిలవాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, హస్తకళల అభివృద్ధి సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఈఈ తానేశ్వర్, డీఈఓ సోమశేఖరశర్మ, తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రవికుమార్, ఎంఈఓ పుల్లయ్యతో పాటు పోట్ల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పైడిపల్లి కిశోర్, బందం నాగేశ్వరావు, మోదుగు సుధీర్‌బాబు, గాలి దుర్గారావు, బీ.పీ. నాయక్, పిల్లలమర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏడు కి.మీ. నడిచి వెళ్లేవాడిని

చిన్నతనంలో ఏడు కిలోమీటర్లు నడిచి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేవాడినని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఏకోపాధ్యాయుడే అన్ని తరగతులకు పాఠాలు బోధించేవారని గుర్తు చేసుకున్నారు. లక్ష్మీపురంలో ఉండే తాను 3వ తరగతి నుంచే సమీపంలోని వైరాకు 7 కి.మీ. నడిచి వెళ్లేవాడినని తెలిపారు. మోకాళ్ల లోతు నీళ్లు, గుట్టల మీదుగా నడిచి వెళ్లే తన విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందేవారని గుర్తు చేసుకున్నారు. ఉదయమే సిద్ధం చేసి చేయి పట్టుకుని కొద్దిదూరం తనతో వచ్చే తల్లి సాయంత్రం తిరిగి వచ్చే వరకు ఎదురుచూస్తుండేదని జ్ఞాపకం చేసుకున్నారు. ఇలా తల్లులందరి ఆలోచనలను మనసులో పెట్టుకుని తాను, సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల డిజైన్లు సిద్ధం చేశామని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా తెలిపారు.

పేదపిల్లలకు కార్పొరేట్ స్థాయిలో బోధన



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, వేదికపై ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తదితరులు

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పొన్నేకల్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన

ఖమ్మంరూరల్: జిల్లాలోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని పొన్నేకల్ సమీపాన 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే పాఠశాల పనులకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయత్వాన రాష్ట్రంలో 28 పాఠశాలలకు శంకుస్థాపన చేస్తుండగా.. పాలేరు నియోజకవర్గంలో ముందుగా శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన సుమారు 3వేల మంది పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లో తర్ఫీదు ఇస్తామన్నారు. ఇప్పటికే యువతకు అభిరుచి ఉన్న రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేలా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటైందని తెలిపారు. ఇక ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల్లోనూ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 21వేల ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా రూ.657 కోట్లతో మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రభుత్వానికి విద్యారంగంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శమని చెప్పారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ప్రపంచంలో ఎక్కడా లేవన్నారు. జాతీయ విద్యా కమిషన్ విధానాలకు అనుగుణంగా నిర్మాణాలు చేయించాలని కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ అద్భుతమైన మౌలిక వసతులతో కూడిన భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోందని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శేష్త, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఈఓ సోమశేఖరశర్మ, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఎస్సీ డీడీ సత్యనారాయణ, ఆర్‌డీఓ గణేష్, తహసీల్దార్ బి.రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఏడీఏ సరిత, ఎంపీఓ రాజారావుతో పాటు తుంబూరు దయాకర్ రెడ్డి, గరికపాటి వెంకట్రావు, లక్ష్మీనారాయణ, బండి జగదీష్, మద్ది వీరారెడ్డి, మల్లారెడ్డి, భూక్యా సురేష్‌నాయక్, చింతమళ్ల రవి పాల్గొన్నారు.

ప్రపంచంతో పోటీపడేలా తర్ఫీదు

- ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు విప్లవాత్మక నిర్ణయం
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులు

రఘునాథపాలెం: తెలంగాణ బిడ్డలను ప్రపంచంలో పోటీ పడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు రూపకల్పన చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి రఘునాథపాలెం మండల కేంద్రంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో వెనుకబాటును తరిమికొట్టి ఎవరిపైనా ఆధారపడకుండా మన పిల్లలనే తీర్చిదిద్దేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే 131 దేశాల్లో కొనసాగుతున్న శ్రీ స్వామినారాయణ్ ఇంటర్నేషనల్ స్కూల్ రఘునాథపాలెంలోనే ఏర్పాటుకానుందన్నారు. కాగా, తమ ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపగా.. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రూ.2 లక్షల పైన రైతులకూ రుణమాఫీ


పామాయిల్ సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. ఇందుకోసం సాగునీరు అందించేందుకు రఘునాథపాలెం మండలంలో ఎన్నెస్పీపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఇక త్వరలోనే రూ.2 లక్షలకు పైబడిన రైతుల రుణాలను మాఫీ చేస్తామని తెలిపారు. అంతేకాక రైతుబీమా, పంటల బీమా సైతం అమలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పోలీసు కమిషనర్, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీఈఓ సోమశేఖర శర్మ, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఈఈ యుగంధర్, ఎంపీడీఓ అశోక్, డిప్యూటీ మేయర్ ఫాతిమా, సొసైటీ చైర్మన్ తాతా రఘురాంతో పాటు కమర్తపు మురళి, మలీదు జగన్, మలీదు వెంకటేశ్వర్లు, రావూరి సైదబాబు, బాలసాని లక్ష్మీనారాయణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బదిలీ మార్గదర్శకాల్లో స్వల్ప మార్పులు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ నుంచి ఉత్తర్వులు
- 15లోగా విధుల నుంచి రిలీవ్‌కు అవకాశం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగుల బదిలీల మార్గదర్శకాల్లో స్వల్ప మార్పులు చేస్తూ టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల చివరి వారం అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికుల బదిలీకి ఆదేశించారు. ప్రస్తుత స్థానంలో రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని బదిలీకి అర్హులుగా నిర్ణయించగా.. అర్హులు ఆప్షన్ ఇచ్చుకునే అవకాశం కల్పించారు. ఈనెల 4 తేదీ వరకు ఉద్యోగులు ఆప్షన్లు ఇవ్వగా.. 7వ తేదీన వివిధ కేడర్లలో ఉద్యోగుల బదిలీ నిర్వహించారు. అయితే, 7వ తేదీ రాత్రి వరకు డివిజన్ స్థాయిలో లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, తదితర కేడర్లల బదిలీ పూర్తిచేయగా.. సర్కిల్ స్థాయిలో బదిలీలు కొనసాగుతుండగానే నిలిపివేయాలని ఆదేశాలు అందాయి. తాజాగా శుక్రవారం రాత్రి సీఎండీ మార్గదర్శకాల్లో స్వల్పమార్పులు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం శుక్రవారమే బదిలీ ఉత్తర్వులు జారీ చేసి బదిలీ ఉద్యోగులను ఈనెల 15నాటికి రిలీవ్ చేయాల్సి ఉంటుంది. ఇక శనివారం నుంచి బదిలీలపై నిషేధం ఉంటుందని వెల్లడించారు. దీంతో శుక్రవారం రాత్రి 9 గంటలకు అధికారులు కార్యాలయాలకు చేరుకుని ఉద్యోగులకు ఉత్తర్వులు జారీ చేయడంలో నిమగ్నమయ్యారు. జిల్లాలో వివిధ కేడర్లకు సంబంధించి 179 మంది బదిలీల జాబితాలో ఉన్నారు.

మహిషాసుర మర్దినిగా అమ్మవారి దర్శనం



మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు తొమ్మిదో రోజైన శుక్రవారం తొలుత శ్రీవారికి అర్చకులు పంచామృతంతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశాక సామూహిక చండీహోమం నిర్వహించి మహా పూర్ణాహుతి సమర్పించారు. ఈమేరకు అలివేలుమంగ అమ్మవారిని మహిషాసుర మర్దిని రూపంలో అలంకరించగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్ శర్మ, రాజీవ్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరంతా పంచదార పంపిణీ !

500 కుటుంబాలకు రెండు కిలోల చొప్పున..



పంచదార పంపిణీ చేస్తున్న వెంకమ్మ కుటుంబీకులు

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెం వాసులకు దసరా సందర్భంగా అడపాల వెంకమ్మ కుటుంబీకులు పంచదార పంపిణీ చేశారు. గ్రామంలోని 500 కుటుంబాలకు రెండు కిలోల చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ సీతారాములు పాల్గొని వెంకమ్మ కుటుంబీకులను అభినందించారు. మాజీ ఎంపీపీ రచ్చా నర్సింహారావు, కాంగ్రెస్ నాయకులు వజ్జా శ్రీనివాసరావు, అడపాల రామారావు, వాసంశెట్టి వేణు, బ్రహ్మం, కోటయ్య, నరసింహారావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



దసరా పండుగను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కొలువైన జమ్మిబండపై ప్రత్యేక దర్శనం.. రావణవధ జరగనుండగా నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తిచేశారు.

సింగరేణికి ఉజ్వల భవిష్యత్

- వందేళ్ల ప్రణాళికతో ముందుకెళ్తున్నాం..
- సంస్థ సీఎండీ బలరాం



మాట్లాడుతున్న సీఎండీ బలరాం, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ సహకారంతో సింగరేణికి ఉజ్వల భవిష్యత్ ఉందని సీఎండీ బలరాం వెల్లడించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి 'ఉజ్వల సింగరేణి–ఉద్యోగుల పాత్ర'పై సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ చాలా దేశాల్లో బొగ్గు వెలికితీయడాన్ని నిలిపివేస్తున్నారని.. ఇక్కడ బొగ్గు నిల్వలు అడుగంటే అవకాశమున్నందున సింగరేణి సంస్థ బొగ్గుతో పాటు ఇతర మార్గాల్లో విస్తరణపై దృష్టి సారించిందని చెప్పారు. సంస్థ వందేళ్లకు సరిపడా ప్రణాళికతో ముందుకెళ్తోందని.. కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం లభిస్తోందని తెలిపారు. కార్మికులు, యాజమాన్యం పరస్పర సహకారంతోనే బొగ్గు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నామని చెప్పారు. సంస్థ ఎదిగితేనే సింగరేణి కార్మికులకు మనుగడ ఉంటుందని గుర్తించాలన్నారు. సత్తుపల్లిలో లారీలకు సరిపడా బొగ్గు లోడింగ్ ఇస్తామని, దుమ్ముధూళితో స్థానికులకు ఇబ్బంది లేకుండా చూస్తూ జీఎం కార్యాలయాన్ని రెండు, మూడు నెలల్లో పూర్తి చేస్తామని సీఎండీ వెల్లడించారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాక బొగ్గు లోడింగ్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. జీఎం షాలెంరాజు, పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు, నాయకులు రజాక్, డాక్టర్ మట్టా దయానంద్, తోట సుజలరాణి, దోమ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'భక్తరామదాసు'లో ఒక మోటార్ రెడీ!



మోటార్‌ను పరిశీలిస్తున్న డీఈఈ, ఏఈ

కూసుమంచి: మండలంలోని భక్తరామదాసు ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లోని గతనెలలో వచ్చిన భారీ వర్షాలతో వరద చేరింది. దీంతో మోటార్లు నీట మునగగా, వరద తగ్గాక అధికారులు మరమ్మతులు చేపట్టారు. గడిచిన 25 రోజులుగా ప్రాజెక్టు డీఈఈ బాణాల రమేష్‌రెడ్డి ఆధ్వర్యాన చేస్తున్న మరమ్మతులు ఓ కొలిక్కివచ్చాయి. ప్రస్తుతం ఓ మోటార్ సిద్ధం కావడంతో శుక్రవారం నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. దీంతో రెండో మోటార్ మరమ్మతులను కూడా వారంలోగా పూర్తి చేస్తామని డీఈఈ తెలిపారు. దీంతో ఈ సీజన్‌లో నీటి ఎత్తిపోతలకు ఇబ్బంది ఉండదని ఆయన వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఏఈ ఆయేషా, సిబ్బంది పాల్గొన్నారు.


ఖమ్మం తహసీల్దార్ సరెండర్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఎన్నికల విభాగం డీటీ ఎస్.కల్పనకు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత తహసీల్దార్ టి.స్వామిని కలెక్టరేట్‌కు సరెండర్ చేశారు. సర్టిఫికెట్ల జారీలో ఆలస్యంతో ఉద్యోగావకాశాన్ని కోల్పోయినట్లు గత సోమవారం గ్రీవెన్స్‌లో ఒక మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో అక్కడే తహసీల్దార్ స్వామిని మందలించారు. అంతేకాక భూసంబంధిత అంశాలపైనా ఫిర్యాదులు అందడంతో ఆయనపై వేటు వేసినట్లు తెలిసింది.















పాఠకులకు, ప్రకటనదారులకు విజయదశమి శుభాకాంక్షలు

Advt. Spl.

దారిద్ర్యాలను పారదోలే వీరలక్ష్మిగా..

- వీరలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన మహాలక్ష్మి
- నేడు నిజరూప దర్శనంలో అమ్మవారు
- దసరా మండపంలో శ్రీరామ లీలా మహోత్సవం

భద్రాచలం: ముగ్గురమ్మల శక్తి స్వరూపిణీ, దారిద్ర్యాలన్నింటిని పారదోలే వీరలక్ష్మిగా శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు సాక్షాత్కరించారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారు శుక్రవారం వీరలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం చివరిగా అమ్మవారు నిజరూపంగా శ్రీ మహాలక్ష్మి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. దీంతో శరన్నవరాత్రి అలంకరణలు పూర్తి కానున్నాయి. విజయదశమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దసరా మండపంలో శమీ, ఆయుధ పూజలతో పాటు రావణాసుర వధగా పేర్కొనే శ్రీరామ లీలా మహోత్స వం జరుగుతుంది. సెలవులు కావడంతో రామాలయంలో భక్తుల సందడి నెలకొంది.

రామదాసు కాలం నుంచి ఆనవాయితీ

భక్తరామదాసు నిర్మించిన దసరా మండపంలో విజయదశమి వేడుకలను నిర్వహించటం రామదాసు కాలం నుంచి ఆనవాయితీగా వస్తుంది. కొన్ని పురాణాల ప్రకారం రామచంద్ర మూర్తి రావణాసురుడిపైన విజయం సాధించింది విజయదశమి రోజునే అని వేదపండితులు చెబుతున్నారు.


వీరలక్ష్మి అలంకరణలో అమ్మవారు

ఈ క్రమంలోనే ఉత్తరాదిన ప్రముఖంగా నిర్వహించే రావణాసుర వధ శ్రీరామ లీలా మహోత్సవం దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో నిర్వహిస్తున్నారు. శ్రీరామాయణ పారాయణం అనంతరం ఉదయం రామయ్యకు పట్టాభిషేక మహోత్సవాన్ని జరుపుతారు. దసరా మండపంలో విశ్వక్షేణ పూజ, పుణ్యావాచనం, శమీ వృక్షం వద్ద ఆయుధ పూజలు నిర్వహిస్తారు. శమీ పత్రాలతో పూజలు అనంతరం భక్తులు శమీ ఆకులను తలలపై చల్లుకుంటారు. జమ్మి ఆకులను శిరస్సులపై ధరించిన వారికి సకల శుభాలు చేకూరుతాయని భక్తులు విశ్వసిస్తారు.

అన్నం ఆశ్రమానికి రూ.30వేల విలువైన బియ్యం



ఆశ్రమంలో బియ్యం అందజేసిన దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని అన్నం ఆశ్రమంలో ఉంటున్న అనాథల ఆకలి తీర్చేలా భూమా కుటుంబసభ్యులు శుక్రవారం రూ.30 వేల విలువైన బియ్యం అందజేశారు. అమెరికాలో భూమా చరితకు ఉద్యోగం వచ్చిన సందర్భంగా ఆమె కుటుంబీకులు బియ్యం వితరణగా అందించారని అన్నం ఆశ్రమం అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూమా శ్రీలక్ష్మి, భూమా ఉమామహేశ్వరరావు, పార్థు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గురు ఆస్పత్రి ఉద్యోగులపై కేసు

ఖమ్మంక్రైం: జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగికి ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడిన ఓ ఉద్యోగితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదైంది. ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా ఆస్పత్రి ఎంసీహెచ్‌లో పీపీటీసీపీ కౌన్సిలర్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగికి సహోద్యోగి దొడ్డపునేని సురేష్ మద్యం మత్తులో ఇటీవల ఫోన్ చేశాడు. ఆస్పత్రిలోని ఎల్‌టీ శ్రీకాంత్, డీపీఎం సత్యకుమార్‌కు ఆమెతో వివాహేతర సంబంధం ఉందని చెప్పారని.. తనతోనూ ఏకాంతంగా గడపాలంటూ అసభ్యంగా మాట్లాడాడు. ఈమేరకు బాధితురాలు షీ టీమ్స్‌ను ఆశ్రయించగా విచారణ అనంతరం సురేష్, శ్రీకాంత్, సత్యకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హుండీల్లో నగదు చోరీ

ఎర్రుపాలెం: మండలంలోని బని గండ్లపాడు లూర్దుగిరి మాత పుణ్యక్షేత్రంలోకి గురువారం రాత్రి చొరబడిన దుండగులు హుండీలు ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు. శుక్రవా రం ఉదయం పరిశీలించగా సమీప పంట పొలాల్లో హుండీలు కనిపించాయి. ఘటనపై చర్చి ఫాదర్ తలపనేని అంతోని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తండ్రీ, కుమార్తెపై దాడి

చింతకాని: సోదరుడితో పాటు ఆయన కుమార్తెపై దాడి చేసిన వ్యక్తిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పాతర్లపాడుకు చెందిన తాళ్లూరి వెంకటేశ్వర్లు కుమార్తె పావని దసరా పండుగకు వచ్చింది. ఆమె పాల కోసం తన తాత రోశయ్య ఇంటికి వెళ్లి వస్తుండగా వెంకటేశ్వర్లు సోదరుడు చంద్రమౌళి ఆమెతో గొడవ పడి చేతులతో కొట్టాడు. ఆమెను ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించిన తండ్రి వెంకటేశ్వర్లును కూడా ఇనుప రాడ్‌తో కొట్టడంతో తలకు గాయమైంది. ఘటనపై పావని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రూ.70వేల విలువైన ఫోన్లు అపహరణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో వరుసగా చోరీలు జరుగుతుండడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. పది రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరాన కోటేశ్వరి ఇంట్లో జరగగా, గురువారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ఉన్న న్యూ ఎస్‌ఆర్ సెల్ పాయింట్ షట్టర్‌ను పగలుగొట్టి చోరీ చేశారు. ఈ మేరకు 14 కొత్త ఫోన్లతోపాటు మరమ్మతుకు వచ్చిన ఏడు ఫోన్లు చోరీ చేశారని, వీటి విలువ రూ.70వేల వరకు ఉంటుందని యాజమాని ఎస్.శ్రీకాంత్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, ఈ దుండగులు షాప్ పక్కన మరో రెండు దుకాణాల్లోనూ చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. ఈమేరకుక్లూస్ టీమ్ చేరుకుని పరిశీలించింది. మండల కేంద్రంలో సీసీ కెమెరాలు లేకపోవడాన్ని దుండగులు ఆసరాగా చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కల్వర్టులో పడి కేటీపీఎస్ ఉద్యోగి మృతి

పాల్వంచ: మద్యం మత్తులో కల్వర్టులో పడి కేటీపీఎస్ ఉద్యోగి మృతి చెందిన సంఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికుల కథనం ప్రకారం. . కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో జేపీఏగా పనిచేసే బొల్లి సమ్మయ్య(58) కనిపించకుండా పోవడంతో గత నెల 27న అతని భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో శుక్రవారం బీసీఎం రోడ్‌లో గొల్లగూడెం క్రాస్ రోడ్ వద్ద ఉన్న కల్వర్ట్‌లో అతని మృతదేహం లభ్యమైంది. మృతుడు మద్యానికి బానిసయ్యాడు. ప్రమాదవశాత్తు కల్వర్ట్‌లో జారి పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.



ముళ్లపొదల్లో వృద్ధుడు


గాయాలతో ఉన్న వృద్ధుడు

మధిర: మండలంలోని దెందుకూరు రైల్వే బ్రిడ్జి కింద ముళ్లపొదల్లో శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు ఉండడం గమనించిన రైల్వే కీ మాన్ మధిర రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సమాచారం అందుకున్న ఆర్‌కే ఫౌండేషన్ బాధ్యులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి చేరుకుని వివరా లు ఆరా తీయగా గాయాలతో రక్తమోడుతున్న వృద్ధుడు సమాచారం చెప్పలేక పోయాడు. దీంతో చికిత్స చేయించి ఆర్కే ఫౌండేషన్ రెస్క్యూ హోంలో ఆశ్రయం కల్పించారు. కాగా, వృద్ధుడి సమాచారం తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని మధిర రూరల్ పోలీసులు సూచించారు.

18క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

బోనకల్: అక్రమంగా తరలిస్తున్న 18క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుబాబు తెలిపారు. బోనకల్ గ్రామ పంచాయతీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో టాటా ఏస్‌లో పరిశీలించగా రేషన్‌బియ్యం లభ్యమయ్యాయని వెల్లడించారు. ఏపీకి తరలిస్తున్నట్లుగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.













హైదరాబాద్ చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 65 అడుగుల దుర్గా మాత విగ్రహం



సిద్ధిధాత్రి రూపంలో బాసర జ్ఞాన సరస్వతి



సిద్ధిధాత్రిదేవిగా అలంపూర్ జోగులాంబ



మహిషాసురమర్దినిగా వరంగల్ భద్రకాళి

స్కిల్స్ యూనివర్సిటీలో నాలుగు కొత్త కోర్సులు

- దసరా నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తుది గడువు అక్టోబర్ 29
- నవంబర్ 4 నుంచి తరగతులు

సాక్షి, హైదరాబాద్: యువతలో నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తొలి విడతలో నాలుగు కోర్సులను దసరా నుంచి ప్రారంభిస్తోంది. నైపుణ్య శిక్షణ కోసం యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్', 'స్కూల్ ఆఫ్ ఈ కామర్స్', 'స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్' పేరిట ఇప్పటికే మూడు స్కూళ్లను ప్రారంభించింది. స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్, ఈ కామర్స్‌లో 'వేర్ హౌజ్ ఎగ్జిక్యూటివ్', 'కీ కన్‌సెనైర్ ఎగ్జిక్యూటివ్' కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్ ద్వారా 'నర్సింగ్ ఎక్సలెన్స్', 'ఫార్మా అసోసియేట్ ప్రోగ్రామ్' కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ ఒక ప్రకటనలో కోరింది. దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 29 చివరి తేదీ కాగా, నవంబర్ 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. తరగతులను తాత్కాలికంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కి), నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఆవరణలో నిర్వహిస్తారు. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఇటీవల యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం తెలిసిందే.

బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్సీ సందడి

పట్టభద్రుల కోటా టికెట్ కోసం ఇప్పటి నుంచే ఆశావహుల ప్రయత్నాలు

- అధినేత కేసీఆర్ దృష్టిలో పడేలా సభ్యత్వ నమోదు పేరిట హడావుడి
- ముందస్తుగా ప్రచారం పేరిట ఫ్లెక్సీల ఏర్పాటు
- ఉపాధ్యాయ కోటా స్థానాల ఎన్నికలకు దూరంగా బీఆర్‌ఎస్?

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ఉపాధ్యాయ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీలు, పట్టభద్రుల కోటాలో ఒక ఎమ్మెల్సీ ఆరేళ్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చిలో ముగియనుంది. ఖాళీ అయ్యే స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో బరిలో నిలిచేందుకు బీఆర్‌ఎస్ నుంచి ఔత్సాహికులు ఇప్పటి నుంచే సందడి చేస్తున్నారు. ఎన్నికలు జరిగే స్థానాల్లో ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో.. ఆశావహులు సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కుల సంఘాల పేరిట జరుగుతున్న సమావేశాల్లో పాల్గొంటూ తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలు, ప్రధాన రహదారుల వెంట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు పేరిట ప్రచారం చేసుకుంటున్నారు. తద్వారా తాము పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నట్టు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు సంకేతాలు పంపుతున్నారు.

ఉపాధ్యాయ కోటాపై అనాసక్తి

వచ్చే ఏడాది మార్చిలో 'మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్' ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి(పీఆర్‌టీయూ)తోపాటు 'వరంగల్-ఖమ్మం-నల్లగొండ' ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి(యూటీఎఫ్) పదవీకాలం ముగుస్తుంది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అధికారికంగా అభ్యర్థులను బరిలోకి దించలేదు. పీఆర్‌టీయూకు పరోక్షంగా



పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో న్యాయవాదులతో సమావేశమైన సర్దార్ రవీందర్‌సింగ్

మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌తో పీఆర్‌టీయూ అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ ప్రత్యక్షంగా, పరోక్షంగా దూరంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి.

అందరి దృష్టి పట్టభద్రుల స్థానంపైనే

'మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్' పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఆసక్తి చూపుతున్నారు. 13 జిల్లాల్లోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పట్టభద్రుల నియోజకవర్గం విస్తరించి ఉంది. ఓటర్లను చేరుకునేందుకు ఇప్పటి నుంచే ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. కరీంనగర్ నుంచి మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మెదక్ నుంచి మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి రాజారాంయాదవ్ బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమ మద్దతుదారులను రంగంలోకి దించి ఓటరు నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ గతంలోనే తనకు హామీ ఇచ్చినట్టు రవీందర్ సింగ్ చెబుతున్నారు.

గతంలో.. బలమున్నా బరికి దూరం

మండలి పట్టభద్రుల కోటా 2019 ఎన్నికల సందర్భంలో 'మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్' నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు (మంథని), జగ్గారెడ్డి (సంగారెడ్డి) మాత్రమే ఉన్నారు. నాలుగు జిల్లాల పరిధిలో కాంగ్రెస్ నుంచి చేరిన ఎమ్మెల్యేల సంఖ్యను కలుపుకొని 40 మంది ఎమ్మెల్యేలున్న బీఆర్‌ఎస్ పోటీకి దూరంగా ఉంది. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రశేఖర్‌గౌడ్‌కు మద్దతు ప్రకటించగా, కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన టి.జీవన్‌రెడ్డి పట్టభద్రుల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

ఇప్పుడు.. కీలక నేతలందరూ ఇక్కడే

ప్రస్తుతం 'మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్' పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో 42 మంది ఎమ్మెల్యేలకుగాను కాంగ్రెస్‌కు 19, బీఆర్‌ఎస్‌కు 16, బీజేపీకి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జి.మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), సంజయ్ (జగిత్యాల), పోచారం శ్రీనివాసరెడ్డి (బాన్సువాడ) కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా కీలక నేతలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌కు క్షేత్రస్థాయిలో సానుకూల వాతావరణం ఉందని, పార్టీ అవకాశమిస్తే గెలుపు సాధిస్తామనే ధీమా ఆశావహుల్లో కనిపిస్తోంది.

▼ నగరోత్సవంలో ఉత్సవమూర్తులు





శ్రీ మహిషాసురమర్ధినిగా దుర్గమ్మ

మహిషాసురమర్దినిగా అనుగ్రహించిన దుర్గమ్మ

నేటి రాజరాజేశ్వరి అలంకారంతో ముగియనున్న దసరా ఉత్సవాలు.. పెరుగుతున్న భవానీ భక్తులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు చివరి దశకు చేరాయి. తొమ్మిదోరోజు శుక్రవారం మహిషాసురమర్థిని రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఇక ఈ ఉత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగియనున్నాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో మూలానక్షత్రం నుంచి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఉత్తరాంధ్ర నుంచి వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరిగింది. ముందస్తు అంచనాలకు అనుగుణంగా ఈ ఏడాది పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా వేసినప్పటికీ గత ఏడాదితో పోల్చుకుంటే భక్తుల సంఖ్య తగ్గింది. ఇప్పటికి దాదాపు 7 లక్షల నుంచి 7.5 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. మహర్నవమి సందర్భంగా తరలి వచ్చిన భక్తులు నగరోత్సవంలో అమ్మవారిని దర్శించుకుని తరించారు.

కనుల పండువగా తెప్పోత్సవం

దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా విజయదశమి రోజు కనకదుర్గాదేవికి కృష్ణానదిలోని దుర్గాఘాట్‌లో సాయంత్రం 5 గంటలకు శ్రీగంగా, దుర్గ అమ్మవార్ల సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కమనీయ దృశ్యాలను భక్తులు వీక్షించేందుకు వీలుగా ప్రత్యేకంగా గుర్తించిన పది ప్రాంతాల్లో ఎల్‌ఈడీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చివరిరోజు అమ్మవారిని దర్శించుకొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది.



అమెరికాలో బతుకమ్మ సంబరాలు

రాయికల్ (జగిత్యాల): అమెరికాలోని విస్కాన్సిన్ స్టేట్ సన్‌ప్రేరీ సిటీలో శుక్రవారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి గౌరీదేవిని ప్రతిష్టించిన అనంతరం ఆడిపాడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సింధు, ప్రవాస తెలంగాణ మహిళలు ఉష, రమ్య, కవిత, ప్రత్యూష, లక్ష్మి, సుస్మిత, లావణ్య, తేజ, దీపిక, హారిక, స్వప్న, శాంతి, శ్వేత, ఆకృతి పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

పోస్టుల మంజూరుకు ఆదేశాలపై హర్షం



డైరెక్టర్ అజయ్‌ను కలిసిన టీఆర్‌వీకేఎస్ నాయకులు

పాల్వంచ: టీఎస్ జెన్‌కో పరిధిలోని అన్ని హైడల్, జనరేటింగ్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న ఓఅండ్ఎం పోస్టుల భర్తీకి సీఎండీ రోనాల్ రోస్, జెన్‌కో డైరెక్టర్(హెచ్‌ఆర్) ఎ.అజయ్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కే.వీ.జాన్సన్, చారుగుండ్ల రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జెన్‌కో డైరెక్టర్ అజయ్‌ను వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏళ్లుగా పోస్టులు భర్తీకాక, పదోన్నతులు రాక ఇబ్బంది పడుతున్న నేపథ్యాన యాజమాన్యం స్పందించి సీఈ, ఎస్ఈలకు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమ పేర్కొన్నారు.

సమష్టి కృషితోనే ఉజ్వల భవిష్యత్

- తెలంగాణకు తలమానికమైన సింగరేణిని అభివృద్ధి చేసుకుందాం..
- కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం, ప్రభుత్వం దృష్టి సారించాలి
- ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు



సీఎంఓఏఐ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): కార్మికులు, ఉద్యోగులు, అధికారులు సమష్టిగా శ్రమిస్తే సింగరేణికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. తెలంగాణకు తలమానికమైన సంస్థను అభివృద్ధి వైపు నడిపించే బాధ్యత అందరిపై ఉందని.. ఇదేసమయాన యాజమాన్యం, ప్రభుత్వం కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం 'భూగర్భగనులు, ఉపరితల గనులు, అనుబంధ విభాగాలలో ఉజ్వల సింగరేణి కార్మికుల పాత్ర' అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో విస్తరించిన సింగరేణిని మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి, కార్మికుల కష్టార్జితాన్ని దోచుకుంటుందని ఆరోపించారు. సీఎస్సార్ నిధులను కోల్‌బెల్ట్ ప్రాంతాల అభివృద్ధికి కాకుండా ఇతర చోట్లకు మళ్లించారని, మితిమీరిన రాజకీయ జోక్యంతో భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. ఇందుకు భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. ఒక పూట భోజనం, స్వీట్‌బాక్స్ ఇవ్వడంతో సరిపెట్టకుండా కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని కూనంనేని తెలిపారు. అనంతరం సీఎంఓఏఐ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఏరియాల వారీగా గనులకు మేనేజర్లను నియమించే సమయాన ప్రతిభ ఉన్న వారిని గుర్తించాలని తెలిపారు. అలాగే, ఓపెన్ కాస్ట్ గనుల ద్వారా నాణ్యమైన బొగ్గు వచ్చేలా పర్యవేక్షించాలని చెప్పారు. ఆతర్వాత ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడగా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్(పీ అండ్ పీ) వెంకటేశ్వరరెడ్డి, జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్, జీఎం(ఐఆర్‌పీఎం) కవితానాయుడుతో పాటు వివిధ విభాగాల అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



కేఓసీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: బొగ్గు ఉత్పత్తిలో రారాజుగా ఉన్న సింగరేణి అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. మండలంలోని కోయగూడెం ఓసీలో శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే మాట్లాడారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు ప్రస్తుత మాదిరిగా పనిచేస్తూనే మరింత మెరుగుపర్చుకోవాలని.. పని సంస్కృతిలో మార్పులు తీసుకురావడానికి కార్మిక సంఘాలు సహకరించాలని సూచించారు. అనంతరం కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు, అధికారులతో కలిసి భోజనాలు చేశారు. వివిధ విభాగాల అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, శివప్రసాద్, ఎం.గిరిధరరావు, శ్రీనివాసరావు, సౌరభ్‌సుమన్, మోహన్‌రావు, బాలాజీ నాయుడుతో పాటుట సుధాకర్, మధుబాబు, మహేష్, అంజిరెడ్డి, సారయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు, విస్తరణకు కృషి

మణుగూరుటౌన్: సింగరేణిలో కొత్త గనులకు అనుమతులు సాధించడంతో పాటు గనుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మణుగూరు ఏరియాలోని ఓసీ–2లో జరిగిన సదస్సులో పాల్గొన్న ఆయన అధికారులు, కార్మికులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న సింగరేణిలో పనిచేయడాన్ని అదృష్టంగా భావించాలన్నారు. అయితే, పరిశ్రమలు, విద్యుత్ థర్మల్ కేంద్రాలకు సకాలంలో బొగ్గు సరఫరా చేసేలా ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని తెలిపారు. భారీ యంత్రాలను వినియోగించుకుంటే ఫలితం ఉంటుందని చెప్పారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గోదావరిలో మొసళ్ల సంచారం



మెట్ల రేవు వద్ద ఇసుక తిన్నెలపై పడుకున్న మొసలి

బూర్గంపాడు: భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం పాత గొమ్మూరు సమీపాన గోదావరిలో మొసళ్ల సంచారం స్థానికులకు భయాందోళన కలిగిస్తోంది. గొమ్మూరు మెట్లరేవు వద్ద ఇసుక తిన్నెలపై శుక్రవారం నాలుగు పెద్ద మొసళ్లు కనిపించాయని పశువుల కాపరులు, మత్స్యకారులు తెలిపారు. ఐటీసీ పీఎస్‌పీడీ వ్యర్థజలాలు గోదావరిలో కలిసే ప్రాంతాన అప్పుడప్పుడు కనిపించే మొసళ్లు శుక్రవారం గోదావరి స్వల్పంగా పెరుగుతుండడంతో దిగువన ఉన్న మెట్లరేవు వైపునకు వచ్చాయి. ఆ ప్రాంతం నుంచే పశువులు, జీవాలను దాటించే కాపరులు, మత్స్యకారులు, నదీస్నానానికి వచ్చేవారు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, ఈ ప్రాంతంలోని మొసళ్లు కనిపించడంతో ఆందోళన చెందుతున్నారు.

మెడిసిన్ విద్యార్థికి చేయూత

- బ్యాంకు ఖాతాలో రూ.4,38,432 లక్షలు జమ
- నేరుగా రూ.2,05,500 అందించిన దాతలు
- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన శ్రీహర్షిత, కుటుంబీకులు



శ్రీహర్షితకు నగదు అందిస్తున్న తుమ్మల యుగేంధర్ స్నేహితులు

వైరా: వైరా 15వ వార్డుకు చెందిన నిరుపేద విద్యార్థిని పొనెం శ్రీహర్షిత వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించగా ఆమె చదువు సాఫీగా సాగేలా దాతలు చేయూతనిస్తున్నారు. కాలేజీ, హాస్టల్ ఫీజులు, ఇతర ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడుతున్న శ్రీహర్షిత పరిస్థితిపై ఈనెల 3వ తేదీన 'సాక్షి'లో 'చదువుల తల్లిని కరుణించని లక్ష్మీదేవి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఆమె ఖాతాలో రూ.2వేలు మొదలు రూ.50 వేల వరకు దాతలు జమ చేస్తున్నారు. ఈనెల 7వ తేదీ వరకు రూ.2,43,521, 11వ తేదీ వరకు కలిపి రూ.4,38,432 లక్షలు జమ అయ్యాయని ఎస్‌బీఐ అధికారులు తెలిపారు. మరోవైపు విద్యార్థినికి నేరుగా శుక్రవారం వరకు రూ.2,05,500 అందించడంతో ఇప్పటివరకు రూ.6,43,932 నగదు అందినట్లయింది. మరోవైపు కెనరా బ్యాంకు అధికారులు ఆమె చదువుకు అండగా నిలుస్తామని చెప్పగా.. పాటుగా వైరా ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ టి.వెంకటరెడ్డి విద్యార్థినిని పిలిపించి ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం ఇస్తామని లేఖ అందించిన విషయం విదితమే.

తుమ్మల తనయుడి ఆర్థిక సాయం

శ్రీహర్షితకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగేందర్ రూ.50 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు నగదును ఆయన స్నేహితులు శ్రీరామినేని భాస్కర్, శ్రీధర్, పూర్ణ, జానీ, సురేష్ అందజేశారు. అలాగే, ఎన్నారై సురేష్ రూ.5వేలు అందించారు. దాతల చేయూతతో శ్రీహర్షిత మెడిసిన్ చదువు సాఫీగా సాగనుండగా.. తమ కష్టాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన 'సాక్షి'కి శ్రీహర్షిత, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా కృష్ణారావు



కృష్ణారావు

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టేట్ స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ కే.వీ.కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్‌గా కృష్ణారావు గత ఆరేళ్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా గత ఏడాది స్టేట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం రెండో సారి ఎన్నికైన కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యమకారులందరినీ కలుపుకుని హక్కుల కోసం పోరాడతానని వెల్లడించారు.

హ్యాండ్‌బ్యాగ్ అప్పగింత

భద్రాచలంటౌన్: భద్రాచలం బస్టాండ్‌లో బస్సు ఎక్కే క్రమాన మరిచిపోయిన హ్యాండ్‌బ్యాగ్‌ను అధికారులు తిరిగి మహిళకు అప్పగించారు. భద్రాచలంకు చెందిన కొడపాల ఉమాదేవి పిల్లలతో కలిసి కాకినాడ బస్సు ఎక్కే క్రమాన హ్యాండ్‌బ్యాగ్‌ను 15వ నంబర్ ప్లాట్‌ఫామ్ బల్లపై మరిచిపోయింది. కొంతదూరం వెళ్లాక ఈ విషయాన్ని గమనించిన ఆమె బస్సు దిగి తిరిగి వచ్చి స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లింది. ఈమేరకు చుట్టీకి చెందిన ఓ మహిళ బ్యాగ్‌ను తీసుకెళ్లినట్లు సీసీ పుటేజీల ద్వారా గుర్తించిన అధికారులు అక్కడి ఉద్యోగులకు సమాచారం ఇచ్చి బ్యాగ్‌ను తెప్పించారు. అందులో 28గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు రూ.వెయ్యి నగదు ఉండగా ఉమాదేవికి అందజేశారు.

ఇంద్రకీలాద్రిపై ఎంపీ వద్దిరాజు ప్రత్యేక పూజలు



అమ్మవారి చిత్రపటం అందిస్తున్న వేదపండితులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం కుటుంబసభ్యులతో కలిసి ఏపీలోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీకనదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, వేదపండితులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలకగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆతర్వాత వేద పండితులు ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదం అందజేశారు. కాగా, ఆలయం వద్ద ఎంపీ వద్దిరాజును మాజీ మంత్రి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీనటులు అశోక్ కుమార్, అనన్య నాగండ్ల తదితరులు కలిశారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక బాధ్యత నాదే..

ప్రచారం చేస్తున్న సుర్దేపల్లి డీలర్‌పై వేటు

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలంలోని సుర్దేపల్లి రేషన్ డీలర్ సోమయ్యను సస్పెండ్ చేసినట్లు నేలకొండపల్లి తహసీల్దార్ జె.మాణిక్‌రావు తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితా సిద్ధం చేసేది తానేనని ఆయన ప్రచారం చేస్తున్నట్లు స్థానికులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి శుక్రవారం గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించగా సుర్దేపల్లి వాసులు ఇళ్ల విషయమై డీలర్ తప్పుడు ప్రచారం చేస్తూ బెదిరిస్తున్నాడని తెలిపారు. దంతో డీలర్‌ను సస్పెండ్ చేయాలని ఆర్డీఓను మంత్రి ఆదేశించారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్ సోమయ్యను ఐదు నెలలు పాటు సస్పెండ్ చేశామని ధ్రువీకరించారు. సమగ్ర విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.